క్లుప్తంగా

పాలిసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

ఆదిలాబాద్‌టౌన్: పాలిసెట్ పరీక్ష దరఖాస్తు గడువును పొడగించడం జరిగిందని ఆదిలాబాద్ సంజయ్ గాంధీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్స్‌పాల్ పి.భరద్వాజ ఒక ప్రకటనలో తెలిపారు. రూ. 200 అపరాధ రుసుంతో మే 14 వరకు ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. మే 17న పాలిసెట్ పరీక్ష నిర్వహించబడుతుందన్నారు.

ఆదిలాబాద్ సభకు తరలిన నాయకులు

నేరడిగొండ: ఆదిలాబాద్ కార్నర్ మీటింగ్‌కు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి రావడంతో మండలంలోని ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు బుధవారం భారీగా తరలివెళ్లారు. నియోజకవర్గ నాయకులు ఆడె గజేందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల్లో వెళ్లారు. మండల కన్వీనర్ ఆడె వసంత్ రావు మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందన్నారు. సభకు వెళ్లిన వారిలో అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, ఏలేటి రాజశేఖర్ రెడ్డి, సద్దాం, జాదవ్ వసంత్ రావు ఉన్నారు.

'హామీలు విస్మరించిన కేంద్ర ప్రభుత్వం'



ప్రజలతో మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

ఎదలాపురం: కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిందని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని నేతాజీచౌక్, వినాయక్, సాత్నాల బస్టాండ్ ప్రాంతంలో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదని, కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగాన్ని పెంచిందన్నారు. పేద, మధ్య తరగతి ప్రజల జీవనం అగమ్యగోచరంగా మారిందన్నారు. బీజేపీ ప్రజల ప్రభుత్వం కాదని, కార్పొరేట్ ప్రభుత్వమని విమర్శించారు. కార్యక్రమంలో సభ్యులు ముడుపు నలినిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు, పట్టణ కార్యదర్శి అరుణ్ కుమార్, గేడం పొచ్చిరాం, కోడప సురేశ్, మడావి గణేశ్, దేవిదాస్, అమినా, మహబూబ్ ఖాన్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

ఇచ్చోడ: మండలంలోని బాదిగూడలో ఈదురుగాలులకు జంగుకు చెందిన ఇంటి పైకప్పు లేచిపోవడంతో ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి బుధవారం రూ. 5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబసభ్యులను పరామర్శి, ధైర్యంగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ దేవురావు, తదితరులున్నారు.

డార్విన్ సిద్ధాంతం తొలగింపు ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న సిడాం సాయికుమార్

ఆదిలాబాద్‌టౌన్: పదో తరగతి పాఠ్యాంశంలో డార్విన్ సిద్ధాంతం తొలగింపు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సిడాం సాయికుమార్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కుమురంభీం భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌సీఆర్టీ పాఠ్య పుస్తకాల నుంచి కొన్ని పాఠ్యాంశాలను తొలగించడంపై వివాదం నెలకొందన్నారు. వాస్తవాలను చెప్పే సైన్స్ పాఠ్యాంశాలను తొలగించి మూఢ విశ్వాసాలు, ఆర్‌ఎస్‌ఎస్ భావాలను పొందుపర్చడం సరికాదన్నారు. సమావేశంలో సహాయ కార్యదర్శి అశోక్, శ్యామ్‌సుందర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

విశ్వకర్మ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రవీణ్

బోథ్: అదిలాబాద్ జిల్లా విశ్వకర్మ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బోథ్ మండల కేంద్రానికి చెందిన మేడిచెల్మ ప్రవీణ్ నియమితులయ్యారు. జిల్లా కేంద్రంలో జరిగిన కార్యవర్గ ఎన్నికల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విశకర్మ సంఘం అభివృద్ధికి పాటుపడతానని పేర్కొన్నారు. తనకు అవకాశం కల్పించిన కుల బంధువులకు కృతజ్ఞతలు తెలిపారు.

రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

ఆదిలాబాద్‌టౌన్: రేవంత్‌రెడ్డి దళిత సమాజానికి క్షమాపణ చెప్పాలని అంబేద్కర్ ఉత్సవ కమిటీ జిల్లా చైర్మన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అంబేద్కర్ చౌక్‌లో సమావేశం నిర్వహించిన సందర్భంగా కనీసం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించలేదన్నారు. గురువారం నిరసన కార్యక్రమం చేపడుతామన్నారు.

ఎండుతున్న 'మత్తడివాగు'



ఎడారిగా మారిన మత్తడివాగు ప్రాజెక్టు

- ఆయకట్టుకు అందని సాగునీరు
- ఎడారిని తలపిస్తున్న పరిసరాలు
- ఆందోళనలో రైతులు



ఎడమకాలువకు తగ్గిన నీటిప్రవాహం

తాంసి: రోజురోజుకూ ఎండలు మండుతున్నాయి. ఎండల తీవ్రతకు వాగులు, వంకలు, చెరువుల్లోని నీటి మట్టం పూర్తిగా తగ్గడంతో ఎడారిని తలపిస్తోంది. గ్రామాల్లో రైతులు సాగుచేసిన పంటలకు పంటచేలలోని బోరుబావుల్లోని భూగర్భజలాలు తగ్గడంతో సాగునీరు అందక ఎండిపోతున్నాయి. మండలంలోని వడ్డాడి మత్తడివాగు ప్రాజెక్టు నీటిమట్టం రోజురోజుకూ తగ్గుతుండడంతో ప్రాజెక్టు పరిసరాలు ఏడారిని తలపిస్తున్నాయి. మండలంలోని రైతులకు అధికంగా సాగునీటిని అందించే ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గడంతో ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 277.5 మీటర్లు, ప్రస్తుతం నీటిమట్టం 273.55 మీటర్లకు చేరింది. ఎడమ కాలువ ద్వారా 8,500 ఎకరాలకు సాగునీరు అందుతుంది. నీటిసామర్థ్యం 0.57 టీఎంసీలు కాగా ప్రస్తుతం 0.185 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ప్రాజెక్టు గేట్ల సమీపంలో మాత్రమే నీరు ఉండడంతో పంటలు ఎండుతున్నాయని రైతులు వాపోతున్నారు. బోరుబావుల్లో సైతం భూగర్భజలాలు అడుగంటాయి.

ప్రమాదకర స్థాయికి..

ప్రాజెక్టులో నీరు ప్రమాదకర స్థాయికి తగ్గింది. గత 15 సంవత్సరాల్లో ఏ ఒక్క సంవత్సరం కూడా ఇంతాలా నీటి మట్టం తగ్గలేదు. ఈఏడాది వేసవిలో మరో నెలరోజుల కంటే ఎక్కువ ఉన్నప్పటికీ అప్పుడే ప్రాజెక్టులో సాగునీటి కొరత ఏర్పడింది. ఎగువ ప్రాంతం నుంచి వాగుల ద్వారా నీరు రావడం నిలిచిపోవడంతో 300 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో ప్రాజెక్టులో నీరు లేక వెలవెలబోతోంది. ఇప్పుడే ఇలాంటి పరిస్థితి ఉంటే పంట చేతికి వచ్చే వరకూ సాగునీరు అందుతుందో లేదోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పశువుల కాపరులు పశువులను పశుగ్రాసం కోసం ప్రాజెక్టు వద్దకు తీసుకెళ్తున్నారు.

నీటి ప్రవాహం తగ్గింది



మత్తడివాగు ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గుతోంది. ఎండల తీవ్రతతో ప్రాజెక్టులో నీరు తగ్గడంతో ఎడమకాలువలో నీటిప్రవాహం తగ్గింది. చివరి ఆయకట్టు రైతులకు పూర్తిస్థాయిలో నీరు అందేలా కనిపించడం లేదు. ప్రాజెక్టులో నీటి పరిస్థితిని చూస్తే యాసంగి పంటలు దిగుబడి వచ్చే వరకు సాగునీరు అందుతుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది.

– కోకటి రాజు, వడ్డాడి, రైతు

పంటలకు సరిపడా నీరు ఉంది

ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి మట్టం తగ్గుతోంది. ఎడమకాలువ ద్వారా పంటల సాగు కోసం రైతులకు అవసరమైనంత నీటిని విడుదల చేస్తున్నాం. ప్రాజెక్టులో ప్రస్తుతం 273.55 మీటర్ల వరకు నీరునిల్వ ఉంది. పంటల సాగుపై రైతులు ఎలాంటి ఆందోళన చెందాలిస్న అవసరం లేదు. కాలువలలో పెరిగిన గడ్డిని తొలగించి, మరమ్మతులు చేయిస్తాం.

– హరీష్, ఏఈ, మత్తడివాగు ప్రాజెక్టు

ప్రతీ గ్రామానికి బీటీరోడ్డు సౌకర్యం



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

ఆదిలాబాద్‌రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ప్రతీ గిరిజన గ్రామానికి బీటీరోడ్డు సౌకర్యం కల్పిస్తున్నామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. చదువుతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందన్నారు. బుధవారం మండలంలోని పిప్పల్‌ధరి గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడికొరి, ఖండాల, ధర్‌లొద్దీ గ్రామాలకు బీటీరోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మామిడికొరి గ్రామానికి రూ. 2.10 కోట్లతో, ధర్‌లొద్దీకి రూ.1.26 కోట్ల వ్యయంతో బీటీ రోడ్డు, కల్వర్టుల నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్న బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, ఎంపీపీ గండ్రత్ రమేశ్, వైస్ ఎంపీపీ కుమ్ర జంగు, పీఏసీఎస్ డైరెక్టర్ మెస్రం పరమేశ్వర్, కుమ్ర లక్ష్మి రాజు, కనక రమణ, టేకం పార్వతిబాయి, మడావి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే జీతం విరాళం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ఆదిత్యనగర్‌లో నూతనంగా నిర్మించే హనుమాన్ ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే జోగు రామన్న తన నెల వేతనాన్ని విరాళంగా అందించారు. ఇటీవల కాలనీలో పర్యటించిన ఎమ్మెల్యే అక్కడి ప్రజలకు హామీనిచ్చారు. ఇందులో భాగంగా మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ బుధవారం ఆలయాన్ని సందర్శించారు. రూ.2.50లక్షల నగదును ఆలయ కమిటీ సభ్యులకు అందచేశారు.

సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



వ్యాపారులతో సమావేశమైన ఓఎస్డీ రాములునాయక్

ఇంద్రవెల్లి: వ్యాపారులు దుకాణ సముదాయాల ఎదుట, ముఖ్యమైన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఓఎస్డీ రాములు నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌లో వ్యాపారులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో ఉన్న వ్యాపార సముదాయాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీసీకెమెరాల ద్వారానే నేరాలు, దొంగతనాలు అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్‌గౌడ్, సీఐ సైదరావ్, ఎస్సై సునీల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణలో భాగస్వాములు కావాలి

ఉట్నూర్‌రూరల్: శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని సీఐ సైదారావు అన్నారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో దుకాణ సముదాయాల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రతీ దుకాణం ఎదుట సీసీకెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అదే విధంగా ఎవరైనా అనుమానస్పదంగా తిరిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గోల్డ్ స్మిత్ యజమానులు రసీదు లేకుండా ఎవరి దగ్గర బంగారం కొనకూడదన్నారు. ఒక సీసీ కెమెరా వంద మందితో తో సమానమన్నారు. సమావేశంలో ఎస్సైలు సుమన్ భరత్, మహేశ్, నాగన్న, దిలీప్, సుగుణ, సిబ్బంది, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



జొన్న పంటను పరిశీలిస్తున్న ఏవో రవీందర్

తాంసి: వడగండ్లతో తాంసి, భీంపూర్ మండలాల్లో దెబ్బతిన్న పంటలను బుధవారం మండల వ్యవసాయాధికారులు పరిశీలించారు. రైతులతో మాట్లాడి పంట వివరాలు తెలుసుకున్నారు. తాంసి మండలంలో 135 ఎకరాల జొన్నపంట, భీంపూర్ మండలంలో 83 ఎకరాల జొన్న పంట దెబ్బతిన్నట్లుగా ప్రాథమికంగా నిర్ధారించారు. వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రవీందర్, ఏఈవోలు యోగిరాజ్, నిఖిత, రైతులు పాల్గొన్నారు.

ఇచ్చోడ: మండంలోని గేర్జం గ్రామంలో బుధవారం ఏఈవో మనీషా జొన్న పంటను పరిశీలించారు. దెబ్బతిన్న పంటలను పరిశీలించి, వివరాలు నమోదు చేసుకున్నారు. నివేదికను మండల వ్యవసాయాధికారికి అందచేయనున్నట్లు తెలిపారు.

పరిహారం చెల్లించాలి

తాంసి: వడగండ్ల వర్షంతో జిల్లాలో పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ.10 వేల పరిహారం అందించాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సామ సంతోశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. చేతికి వచ్చే దశలో జొన్న, నువ్వు, పెసర పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం స్పందించి సర్వే నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పోచ్చారెడ్డి, విలాస్, నర్సారెడ్డి, శ్రీనివాస్ రైతులు విలాస్, సంతోశ్, భూమన్న పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీవోఏల సమ్మె



ఆందోళన చేస్తున్న వీవోఏలు

బోథ్: సమస్యలు పరిష్కరించాలని వీవోఏలు చేస్తున్న సమ్మె బుధవారం పదో రోజుకు చేరుకుంది. తమ వేతనాన్ని రూ. 26 వేలకు పెంచాలన్నారు. ఉద్యోగ భద్రత, ఐడీకార్డుల మంజూరు, భీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షలో మండల అధ్యక్షులు నడికుంట స్వామి, కార్యదర్శి పవార్ శ్యామ్ రావు, వీవోఏలు జ్యోతి, రాజు, జలపతి, మానిక్ రావ్, సవిత, రాజశ్రీ, సునీత, తదితరులు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: సమస్యలు పరిష్కరించాలని వీవోఏలు చేపట్టిన నిరవధిక సమ్మె కొనసాగుతోంది. బుధవారం పదో రోజు ఐకేపీ కార్యాలయం ఎదుట స్వచ్ఛత పనులు చేసి నిరసన తెలిపారు. మండల అధ్యక్షుడు షేక్ ఫెరోజ్ మాట్లాడుతూ.. కనీస వేతనం లేక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో కోట్నాక్ భారిక్‌రావ్, జుగ్నాక్ భారత్, వినోద్, ప్రహ్లద్, జానకీ పాల్గొన్నారు.

తాంసి: భీంపూర్ మండల కేంద్రంలో వీవోఏలు వీధులను చీపుర్లతో శుభ్రం చేస్తూ నిరసన తెలిపారు. ఈ నిరసనకు అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ, అంగన్‌వాడీ సభ్యులు మద్దతు తెలిపారు. వీవోఏల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వీవోఏలు అరుణ్, రాంజీ, పుష్పలత, రాణి పాల్గొన్నారు.

దొరికిన బ్యాగు అప్పగింత



బ్యాగు అందజేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

ఉట్నూర్‌రూరల్: ఉట్నూర్ డిపోకి చెందిన బస్సులో కెరమెరి నుంచి ఉట్నూర్ ఎక్స్‌రోడ్డుకి ప్రయాణించిన రమేశ్ అనే సర్వేయర్ బస్సులో బ్యాగు మరిచిపోయాడు. బ్యాగును గమనించిన కండక్టర్ ప్రభుదాస్ డిపో అధికారులు అందజేశారు. దీంతో ప్రయాణికుడి వివరాలు కనుక్కొని అతడికి బ్యాగు అందజేశారు. ట్రాఫిక్ ఇన్‌చార్జి జనార్దన్, ఏడీసీ రామకృష్ణ, సీఐ జనరల్ మూర్తి, భీంరావులు కండక్టర్‌ను అభినందించారు.

బహుమతులు ప్రదానం



బహుమతి అందజేస్తున్న పాయల్ శరత్

బేల: మండలంలోని షంషాబాద్ గ్రామ శివారులో భజరంగ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. విజేతగా నిలిచిన పొంద్రకవడ జట్టుకు రూ.41వేలు, రన్నరప్‌గా నిలిచిన షంషాబాద్ జట్టుకు రూ.21వేల నగదుతో పాటు మెమొంటోను పాయల్ ఫౌండేషన్ చైర్మన్ పాయల్ శరత్ అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దత్తా నిక్కమ్, రామెల్లి మోరేశ్వర్, కొడె ప్రదీప్, ధర్నే జీవన్, తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. శిథిలావస్థలో వంతెన



బజార్‌హత్నూర్: మండలంలోని మోర్కండి ఆర్‌అండ్‌బీ రోడ్డులోని చింతలసాంగ్వీ సమీపంలోని కడెం వాగుపై ఉన్న శిథిలావస్థకు చేరింది. దీంతో వంతెనపై నుంచి ప్రయాణించాలంటే వాహనదారులు జంకుతున్నారు. అధికారులు స్పందించి కొత్త వంతెన నిర్మాణం చేపట్టాలి.

– సంబంధిత అధికారి: నర్సయ్య, ఈఈ, ఆర్‌అండ్‌బీ, ఫోన్: 94928 10052

'బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి'



పార్టీలోకి ఆహ్వానిస్తున్న సాకటి దశరథ్

బజార్‌హత్నూర్: బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్ అన్నారు. బుధవారం మండలంలోని ఏసాపూర్‌లో పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో సీసీరోడ్లు, వైకుంఠ ధామాలు, సెగ్రిగేషన్ షెడ్లు, రైతు వేదికలు, డంపింగ్ యార్డుల నిర్మాణానికి ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తే రాష్ట్ర ప్రభుత్వం తమవిగా ప్రచారం చేసుకుంటుందని మండిపడ్డారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే మానాజీ, మాధవ్‌రావ్ ఆమ్టే, వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్, బత్తిని సుధాకర్ యాదవ్, భీంరెడ్డి, బాబారావ్, సోన్‌టాకే గజానంద్, సర్పంచులు నందీశ్వర్, మారుతి, యాదవ్‌రావ్, లింగన్న, సంతోశ్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు



నర్సరీలో పెంచుతున్న మొక్కలు



మొక్కలు ఎండిపోకుండా ఏర్పాటు చేసిన గ్రీన్‌నెట్

- నర్సరీల చుట్టూ గ్రీన్‌నెట్ ఏర్పాటు
- మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు

ఆదిలాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు సంరక్షణకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రతీ గ్రామ పంచాయతీలోని నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేస్తున్నారు. మండలంలో మొత్తం 34 గ్రామ పంచాయతీలు ఉండగా.. ప్రతీ గ్రామ పంచాయతీలో నర్సరీ ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన మొక్కలు పెంచుతున్నారు. ఇదిలా ఉండగా.. కొన్ని గ్రామ పంచాయతీల్లో పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టితో కొన్ని హరితహారం నర్సరీలు ఆదర్శంగా నిలుస్తున్నాయి.

గ్రీన్‌నెట్ ఏర్పాటు..

మండలంలోని యాపల్‌గూడ గ్రామ పంచాయతీలోని నర్సరీకి ప్రత్యేకంగా పర్మినెంట్ షెడ్డు వేశారు. షెడ్డు చుట్టూ, పైన గ్రీన్‌నెట్ ఏర్పాటు చేసి మొక్కలకు ఎండ తగలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఎండల తీవ్రతకు మొక్కలు ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకుటున్నారు. నర్సరీ లోపల చల్లని వాతావరణ కల్పిస్తున్నారు.

ప్రజలకు అవసరమైన మొక్కలు

యాపల్‌గూడ నర్సరీలో ఇంటి ఆవరణలో, రోడ్డుకు ఇరువైపులా నాట్టేందుకు సుమారు 11వేల మొక్కలు సిద్ధం చేస్తున్నారు. ఇందులో గులాబీ, మందర, కాగితం పువ్వులు, మల్లె, గిన్నెర, గుల్మొర, నిమ్మ, వేప, కనుగ, అల్లనేరడి, తదితర మొక్కలను పెంచుతున్నారు. మొక్కలు ఎండిపోకుండా ఉదయం, సాయంత్రం నీటి తడులు అందిస్తున్నారు.

సన్మానం



సన్మానిస్తున్న ఆర్ఎంవో చంపత్‌రావు

కైలాస్‌నగర్: ఇటీవల నూతనంగా ఎన్నికైన తెలంగాణ వైద్య ప్రజారోగ్య ఉద్యోగుల సంఘం (హెచ్-1) జిల్లా అధ్యక్షుడు బండారి కృష్ణ, ప్రధాన కార్యదర్శి రఘురామారావు, ప్రచార కార్యదర్శి బి.ప్రమోద్ కుమార్‌లను బుధవారం ఘనంగా సన్మానించారు. రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆవరణలో ఆర్ఎంవో చంపత్‌రావు, ఉద్యోగులు, సిబ్బంది సత్కారించారు.

అ'పూర్వ' సమ్మేళనం



తలమడుగు: మండలంలోని బరంపూర్ జెడ్పీఎస్ఎస్ పాఠశాల 2005- 2006 బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాలలో గడిపిన జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. స్నేహితుల యోగక్షేమాలు తెలుసుకొని సరదాగా గడిపారు. అనాడు విద్యాబుద్ధులు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ముడుపుకేశ్వర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు ఆకుల నారాయణ, బండి రవి, రాము, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.